కథ

# బృంద



కాశీభట్ల
వేణుగోపాల్

**మబ్బు పట్టినాకాశం... ఈదురు గాలిలో తేలివస్తూన్న వాన పరిమళం...**

**గుండెల్నిండా చెమ్మ నిండిన గాలిని పీల్చుకున్నాను...**

*పరిచిత గత ఖేదం... ఎప్పటికో ఘనీభవించింది... కరిగి గుండెల నిండా నిండిన చెమ్మగాలితో చేరి... కళ్ళలోకి చేరుకుంది... కరెంటు పోయింది...*

వెలుగుతున్న కొవ్వొత్తి శిఖ రెపరెపలాడుతోంది...

గదిచీకటి నలుపుదనాన్ని పలుచబరచడానికి లేత బంగారు కాంతి బలహీనంగా ప్రయత్నిస్తోంది.

గోడకు వేల్లాడ్తోన్న ఫయ్యూం... ఘనీభవించిన చిర్నవ్వ తో... ఎందుకెళ్ళిపోయావ్ ఫయ్యూ... నన్నొంటర్ని చేసి....

ఎట్లా లాగనీ జీవితాన్ని...?

టేబిల్మీద చేతులు మడిచి వాటి మీద తల పెట్టుకుని కల్లార్పకుండా...

ఆ బంగారు కాంతిలో మసగ్గా కనిపిస్తోన్న ఫయ్యూం ఫోటోను చూస్తు న్నా...

ఇంత వంటరితనంతో...

జ్ఞాపకమై వేల్లాడ్తోన్న ఫయ్యూం ముఖం గోడమీద...

ఎంత వూరట...!

'మా!' బృంద గావుకేకతో ఉలిక్కిపడ్డాను.

తబ్బూ పరుగెత్తుకొచ్చి నా చేయి పట్టుకుని నించుంది...

దాన్ని తరుముతూ బృంద వగరుస్తూ... వచ్చి నుంచుంది.

తబ్బూ వేపు చూపుడు వేలుతో చూపుతూ బృంద...

ఇద్దర్నీ రెండు చేతుల్తోటీ విడదీస్తూ అడిగా...

"ఏవిటీ ఏం చేశావ్ మళ్ళీ?"

"దాని పెట్టినిండా మట్టి మట్టిగా వుందమ్మా... ఆ బురద బొమ్మోటి పగిలిపోయింది. నే తీస్తుంటేనేమో.... మట్టికదా.... అందుకని... "తీకు తీకు"మని తోస్తోంది. చెప్పు మా పెట్టినిండా మట్టైంది... యింకా వున్నా యి ఆ బురద బొమ్మలు...

"దానిపెట్టి దానిష్టం... దానిజోలి నీకెందుకు చెప్పు... వద్దన్నానా....

బృందా దా దామ్మా... మట్టి కదా అందకని తీస్తోంది చెల్లి... నీ పెట్టె లో బొమ్మలేం తీయదులే".

ఇద్దర్నీ దగ్గరికి తీస్కున్నా...

ఆ చీకట్లో... వస్తూన్న యీదురు గాల్లోంచీ... ఫయ్యూం నవ్వు తరం గాల్లా కలిసొచ్చినట్టు...

ఫయ్యూం ఫోటో వంక చూసా...

దానికున్న గాజు పలకలో బృంద ముఖం కొవ్వొత్తి వెలుగులో...

ఫయ్యూం మసక ముఖమ్మీద గాజు పలకపై బృంద ప్రతిబింబం...

రెండూ మసక మసగ్గా అలుక్కుపోయి...

మళ్ళీ దేనికది విడివిడిగా...

దగ్గరికి లాక్కుని యిటు తబ్బు అనే తబస్సుంనీ అటు బృందనీ నిండుగా కావలించుకున్నా...

బృంద నన్ను విడిపించుకుని తెరిచుంచుకున్న తన పెట్టి దగ్గరికెళ్ళి కూచుంది...

"ఈ బురద బొమ్మలు పగిలి పోతామమ్మా...చెప్పూ... అదింటంలే...

దానెద్దుకి కాళ్ళూ కొమ్ములూ తోకా అన్నీ విరిగిపోయాయి...

మిగిల్న బొమ్మలు కూడా విరిగిపోయాయి...అసలు దానికి బొమ్మల్చె య్యటం రానేరాదు... చూడు చూడు... విరిగిపోయినెద్దుతో ఎట్లా ఆడుకుం టోందో" తబ్బు రహస్యంలాగా అంది.

నెమ్మదిగా లేచి బృందవేపు కదిలా.

మడిచిన న్యూస్పేపరు మీద ముక్కలు ముక్కలుగా విరిగిన మట్టెద్దుని ఒక్కో భాగంగా తీసి మళ్ళీ ఓ ఆకారంలోకి తీసుకురాటానికి యత్నిస్తోంది బృంద...

ఓ నిముషం తర్వాత...

విరిగిన ఆ మట్టెద్దుని ఓ ఆకారంలోకి సర్దింది బృంద...

"ఛీ... రాలే" గట్టిగా అనేసింది తబ్బు...

ఒక్కసారి తలెత్తి తన వెనక నించున్న మా వంక కళ్ళు విప్పార్చి కింది లావాటి పెదవిని నోట్లో కరచుకుని చూసింది బృంద...

కొవ్వొత్తి బంగారుకాంతి బృంద ముఖాన్ని ముక్కలు ముక్కలుగా

చూపుతోంది...

> విశాలంగా వికసించిన బృంద కళ్ళ నిండా నీళ్ళు నిండుకున్నాయి... మట్టెద్దు విరిగిన బాధ ఓ వేపు... విరిగిన మట్టెద్దు విడిభాగాలు కుదరక వంకర టింకరగా మిగిలిన ఆ బొమ్మ బాధ యింకోవేపు... చెల్లి కామెంట్ చేసిన బాధ యింకో వేపూ. అన్నీ కలగలిశాయి బృంద కన్నీళ్ళలో...

విశాలంగా వికసించిన బృంద కళ్ళనిండా నీళ్ళు నిండుకున్నాయి...

మట్టెద్దు విరిగిన బాధ ఓ వేపు...

విరిగిన మట్టెద్దు విడిభాగాలు కుదరక వంకర టింకరగా మిగిలిన ఆ బొమ్మ బాధ యింకోవేపు...

చెల్లి కామెంట్ చేసిన బాధ యింకోవేపూ.

అన్నీ కలగలిశాయి బృంద కన్నీళ్ళలో...

మళ్ళీ తల దించుకుని... ఆ విరిగిన మట్టెద్దు విడిభాగాల్ని ఒక్కోటి పెట్టెలోకి చేర్చసాగింది.

మౌనంగా అక్కడ్నుంచీ కదిలి వెనక్కొచ్చా తబ్బూని పట్టుకుని...

పన్నెండేళ్ళొచ్చినా యింకా అయిదేళ్ళ పాపే బృంద...

ఏదీ త్వరగా గ్రహించలేదు...

రెండో ఏట వైరల్ ఎన్‌సెఫలైటిస్ సోకి... శారీరకంగా కోలుకున్నా, మానసికంగా ఎదుగుదల పూర్తిగా మందగించింది బృందకు...

నేనక్కడే ఉంటే నన్నూ తబ్బూనీ చూసి ఉక్రోషంతో యింకా ఏడుస్తుంది... అందుకని అక్కడ్నుంచి వచ్చేశా...

"పారేయనూ మా... విరిగిపోయింది కదా ఎద్దూ....అంతా మట్టి మట్టీ" మళ్ళీ రహస్యంగా అంది తబ్బు...

"ష్!" అన్నట్టు నోటిమీద వేలు పెట్టుకుని దాన్ని వారించా...

అది కూడా పెద్ద అర్థమయినట్టు నోటిమీద వేలెట్టుకుని తలాడించి "విరిగిపోయింది కదా" అంది మళ్ళీ రహస్యంగా గాలితో మాట్లాడ్తో... నవ్వొచ్చింది...

నవ్వును వెన్నంటే ఏడుపొచ్చింది...

నవ్వుతూన్న ఫయ్యాం ఫోటోని చూడగానే కోపమొచ్చింది...

నా కళ్ళలో మార్పు గ్రహించి తబ్బూ చిన్నగా నా చేయి వదిలి దూరంగా గోడకానుకుని పుస్తకాల సంచీ ముందు గొంతు కూచుని రెండు చేతుల్లో మొహం వుంచుకుని కళ్ళు సగం మూసి నన్నే చూస్తోంది...

బృంద కేసి చూసా...

తన ప్రపంచమైన ఆ పెట్టెని మూసేసి... దాని మీద చేయి వేసి కిటికీ లోంచి చీకటి ప్రపంచాన్ని శూన్యం నిండిన కళ్ళతో చూస్తోంది... తనకిప్పుడు నేనూ తబ్బూ లేము...



తనకై తనే ఏదో అర్థంకాని భావం... ఆ కళ్ళలో....

మనస్సు కకావికలు...

ఆలోచనలు శత సహస్రాలుగా చిట్లిపోయి...

ఏమీ తెలియని తనంలోకి ఏమీ కానితనంలోకి ప్రయాణించడం ఎంత కష్టం!

ఎంత అద్భుతం!

ఆ ముఖంలో 'కళావతి' వాయిస్తూ వాయిస్తూ చటుక్కున ఆపేసి మోగిస్తున్న వేణువును గాల్లోకి విసిరేసి పట్టుకునే ఫయ్యాం 'ఈ రాతి బల్ల మనకోసం ఈ ప్రకృతి ఎన్ని కోట్ల సంవత్సరాలు కష్టపడి చేసిందో కదా...' అన్న అతని నగ్న శరీరపు ఉద్విగ్నపు వెచ్చదనం స్ఫురించింది. అలసిన ఆ తరువాత ఫయ్యాం కళ్ళకాంతిలో తడిసి పోయిన ఆ పురాతన శిలా రహస్యం... యిపుడు బృంద కళ్ళ భావ రాహిత్యంలో జీర్ణమైపోయినట్టు...

రాలిపోయిన ఎండుటాకుల కుప్పపై వెల్లకిలా పడుకుని తెల్లటి లాల్చీ కుర్తాలో ఫయ్యాం.. కాళ్ళు పైకెత్తి మూడేళ్ళ బృందని కాళ్ళపై ఉంచుకుని పైకెత్తితే... కేరింతలు పెట్టిన బృంద గొంతుకలో విచ్చుకున్న ఆకుపచ్చని చెట్ల రహస్యగానం... మళ్ళీ వింటున్నట్టు....

ఈదురు గాలికి కొవ్వొత్తి రప్పున ఆరిపోయింది.

'మా!' బృందా తబ్బూ యిద్దరూ ఒకేసారి చిన్నగా కేక పెట్టారు...

కొవ్వొత్తిని మళ్ళీ వెలిగించా...

టేబిల్మీద పెట్టుంచిన చిన్న ప్లాస్టిక్ ప్లేట్లో కరిగి కరిగి రెండంగుళాలు మాత్రం మిగిలిన కొవ్వొత్తి...

చుట్టూరా కరిగి, కారి కారి ఘనీభవించిన మైనం...

మినియేచర్ పాలరాతి కొండలా వుంది...

అందులో రకరకాల ఆకృతులు...

రెండు దీపపు పురుగులు రెపరెపలాడ్తోన్న కొవ్వొత్తి మంటచుట్టూ...

ఓ పురుగు చటుక్కున కాలి,రాలి కరిగిన మైనంలోపడి కాస్సేపు అటూ యిటూ కదిలి నిశ్చలమైంది.

గోడమీది ఫయ్యాం ఫోటోవేపు అప్రయత్నంగా చూసా...

"మా! ఆం" బృంద వెనక నించీ రెండు చేతుల్తో కావలించుకుని అడిగింది...

గోడకానుకుని పుస్తకాల సంచీ ముందు గొంతు కూచున్న తబ్బూ కూడా ఆకలన్నట్టు తలూపింది.

బృంద చేతులు విడిపించుకుని లేచా...

కరెంటొస్తే బావుణ్ణు అనుకున్నా... ఉదయం వంటకి అన్నీ సిద్ధం చేసుకోవాలి. రేపు బృంద స్కూలుకెళ్ళాలి. 'రమ్మని' స్కూలు కరస్పాండెంట్ నించీ పిలుపొచ్చింది... వాళ్ళు కూడా దాన్నింటికి తీసుకెళ్ళమంటారు తెలుసు... ఏం చేయను?

దానికి రావడమైతే పన్నెండేళ్ళొచ్చాయి... తెలివి? ఇప్పటికీ చిన్న చిన్న పదాలూ, వాక్యాలూ మాత్రం రాయడమొచ్చింది... ఆఫీసుకి దగ్గర్లో ఏ స్కూలూ లేదు... ఊరికి అటువేపు బృందలాంటి పిల్లల కోసం ఓ స్కూలుంది కానీ దాన్నెలా అక్కడ పంపించి చదివించడం. ప్ఛ్!

బృందవేపు దిగులుగా చూచా...

లంగా కుచ్చిళ్ళలోని ఓ మడతని కుడిచేతి చూపుడు వేలూ బొటనవేలూ మధ్య వుంచి... సాపు చేస్తోంది... వేగంగా.

కళ్ళు ఎదురుగా గోడవైపు శూన్యంగా చూస్తున్నాయి...

చేతితో లంగా మడత... వేగంగా చేయి ఆ మడతని సాపు చేస్తో...

డాక్టరేదో పేరు చెప్పాడు అలా పదే పదే చేయడం గురించి... దిగులెక్కువైంది.

బ్రతకడానికీ ఈ పసికూనల్నిద్దర్నీ బ్రతికించడానికీ కనీసం ఉద్యోగమైనా వుంది... తాతయ్య మిగిల్చి వెళ్ళిన ఈ చిన్న కొంప గూడులా వుంది...

స్కూలు కరస్పాండెంట్‌ని రిక్వెస్ట్ చేయాలి... ఆవిడేదో మెహర్బానీ చేస్తున్నట్టు... అసహ్యంగా దేబరించాలి...ఆ కరస్పాండెంట్ మొహం గుర్తొచ్చి ఒక్కసారిగా బృంద మీద కోపమొచ్చింది...

నా మీద నాక్కూడా... ఫయ్యూమ్మీద యింకా...

"మా! ఆమ్" బృంద గొంతు ప్రపంచంలోని అమాయకత్వాన్ని సొంతం పీల్చేసుకుని...

దానివేపు చూసా...

పదిహేను పదహారేళ్ళ పిల్లలా శరీరం ఎదిగింది...

కానీ?!.... .... ఆ స్పృహ దానికస్సల్లేదా?

ఎన్ని వికారపు చూపులు దీని శరీరాన్ని నాకాయో?

ఒళ్ళంతా గొంగళి పురుగులు పాకినట్లైంది...

తల విదుల్చుకున్నా...

నా తల విదిలింపుకన్నట్టు కరెంటొచ్చింది...

పిల్లల్తో సహా ఆ వెలుక్కి కళ్ళు చిట్లించా...

తబ్బు... "ఆయ్" అంది...

బృంద నోరంతా తెరచి పళ్ళన్నీ బైట పెట్టి నిశ్శబ్దంగా నవ్వింది...

ఓ క్షణంపాటు లంగా మడతని సాపు చేస్తూన్న చెయ్యి ఆగింది... తబ్బూ ఓ గెంతు గెంతి టేబిల్మీది కొవ్వొత్తిని 'ఉఫ్'మని ఊది ఆర్పేసింది. చిన్న మిణుగురులా కొవ్వొత్తి చివర నిప్పు... పైకి పొగ విచిత్రమైన ఆకృతుల్లో... కొవ్వొత్తి ఆరిన వాసన...

ఆ పొగని చూపుడు వేలితో చెరిపేస్తున్నట్టు అటూయిటూ...తబ్బు.... తబ్బూ... తబస్సుం... చిర్నవ్వు...

అప్రయత్నంగా నా పెదవులు విచ్చుకున్నాయి.

చాలు చాలు... వీళ్ళిద్దరూ వుంటే యీ ప్రపంచం యావత్తునీ జయించగల్గనిపిస్తుంది.

పిల్లలిద్దరికీ అన్నాలు కలిపెట్టి నేనో రెండు ముద్దలు తిని రేపటిని ఎదుర్కోడానికి సిద్ధపడుతూ లైటార్పి నడుం వాల్చా...



***

ఏదో బస్సులో ప్రయాణిస్తున్నా...

వెచ్చగా ఉన్ని దుప్పటి రంగు రంగుల చిత్ర విచిత్రమైన డిజైన్లతో వుంది.

వంటినిండా కప్పుకున్నా...

బస్సు కదుల్తోంది...

పరిచయం ఉన్నట్టుగా అనిపిస్తున్నవీ... అస్సలు పరిచయం లేనివి అయిన స్థలాలు చకచకా దాటి వెళిపోతున్నాయి...

ఉన్నట్టుండి బస్సాగింది...

డోరు దగ్గర నుంచున్నా...

అందరూ నన్ను తోసుకుంటూ దిగి వెళ్తున్నారు...

ఫయ్యూం నాన్న నన్ను అసహ్యంగా చూస్తూ తోసుకువెళ్ళాడు...

అమ్మ ముఖం లీలగా... అమ్మేనా... అమ్మా! పిలిచా...

ఆవిడ ఆగకుండా దిగెళ్ళిపోయింది...

నన్నెవరో తోసారు...

కిందున్నా.... బస్సెళ్ళిపోయింది... దుమ్ము రేగింది...ఆ ధూళి అంతరించే సరికి నా చుట్టూ ఎవ్వరూ లేరు... బస్సుతోపాటు దిగిన వాళ్ళందరూ లేరు... ఒక్కరు కూడా...

నా ముందు నిర్మానుష్యంగా ఓ యిరుకుదారి...

ఇప్పుడు నా చేతుల్లో రెండు పెట్టెలు...

విపరీతంగా గాలి రేగింది...

కప్పుకున్న రంగురంగుల ఉన్ని దుప్పటి ఎగిరింది గాల్లోకి...

అందుకోడానికి ఎగిరా...

అందుకోడానికి ఎగిరా...

అందలేదు. ఓ పెట్టె కింద దించి యింకో పెట్టెని చేతిలో వుంచుకునే మళ్ళీ దుప్పటి అందుకోడానికి ఎగిరా...

దుప్పట్ని గాలి చాలా ఎత్తుకు లేపేసింది...

దూరంగా... చాలా... చాలా దూరంగా... కనుమరుగైపోయింది...

రెండు పెట్టెల్తో ఆయాసపడ్తూ నిర్మానుష్యంగా వున్న ఆ యిరుకుదారిలో నడుస్తున్నా...

ఉన్నట్టుండి ఆ వీధిలోకొచ్చా...

అన్నీ తలుపులు మూసేసిన ఇళ్ళే...

వీధి వీధి నిర్మానుష్యం...

ఎవర్నో ఎవరో తెలీని ఎవర్నో పిలుస్తున్నా...

నోరు పెగలదు...

గట్టిగా అరిచినట్టుగా మళ్ళీ మళ్ళీ ఎవర్నో పిలుస్తున్నా...

స్వరం రాదు... ప్రతి యింటి తలుపూ తడుతున్నా...

ఉన్నట్టుండి వీధి మాయం...

దారి యింకా యిరుగ్గా అయ్యింది.

చేతుల్లో పెట్టెలు బరువెక్కుతున్నాయి...

ఉన్నట్టుండి దారి ఆగిపోయింది...

కుడి చేతిలో పెట్టెని నెమ్మదిగా దించా... ఎడమ చేతిలో పెట్టె చేతిలోంచి జారిపడి భళ్ళున తెరుచుకుంది...

దాన్నిండా మట్టి బొమ్మలు... ఓ బొమ్మ మొహం పెద్దగా అయ్యి... "మా... మా...మా" అంటోంది.

ఉలిక్కిపడి లేచా...

బృంద...

ఒంటేలు పోసుకుందుకే "మా! మా! మా!" అంటూ కుదుపుతోంది.

***

నూర్ రాక నన్ను నిద్ర లేపింది.

ప్రతీ ఉదయం చిరాకుతో లేవడమే అయ్యింది... విసుగ్గా టైం చూసుకున్నా... పావు తక్కువ ఆరు...

ఆవులిస్తూ...జారిన వెంట్రుకల్ని ముడి వేసుకుని తలుపు తీసా...

నూర్ అనే నూర్బానో... ఎదురుగా. పాల ప్యాకెట్లతో.

బైట వాతావరణంలో పెద్ద మార్పేమీ లేదు...

ఈదురు గాలులు వీస్తూనే వున్నాయి... వర్షం బాగా కురిసేట్టుగా వుంది.

నూర్ నన్ను తప్పించుకుని లోపలికెళ్ళింది...

బైటికోమాటు తొంగిచూసి మరోమాటావలించి తలుపేసి... యుద్ధానికి సిద్ధమైపోయా.

ఇప్పుడు లేపితేగాని పిల్లలిద్దరూ తయారవ్వరు... నాకే లేవడానికి బద్ధకం. యిక పిల్లలా!

ఇద్దరూ రగ్గుల్ని ముఖాల్నిండా లాక్కుని వుండల్లా పడుకున్నారు...

ఇద్దర్నీ కుదిపి కుదిపి లేపా...

బృందని ముందు శుభ్రం చేయాలి... దాన్ని చెయ్యిపట్టి లేపాను...

ముక్కుతూ మూలుగుతూ యిద్దరూ లేచి కూచున్నారు...

తబ్బూ రగ్గుని తలమీంచీ నిండుగా కప్పుకుని...

"ఉహుహుహూ... మా చలే" అంది...

ఓసారి జాలేసింది... కానీ తప్పదే....!

"లేండి లేండి" అని లేవగొట్టా...

"వుండుండు నేముందు నేముందు... నా క్లాసెట్టుందీ రోజు..." అని లేచి నుంచున్న బృందని తోసుకుంటూ తబ్బూ బాత్రూంవేపు పరుగు తీసింది.

బృంద తన వ్యక్తిగతమైన పన్లు తన్జేసుకోగల్దు. అదో సౌలభ్యం నాకు. అయితే అన్నీ చాలాచాలా నెమ్మదిగా చేస్తుంది... టైంకి తెమలదు. అందుకన్జే యించాలి. బృంద చిన్నగా ఆవలించి... నా వేపు ఓ చిర్నవ్వు లాంటిది విసిరేసి కిటికీ దగ్గరకెళ్ళి బైటికి చూస్తా నించుంది... మళ్ళీ వెనక్కి తిరిగి "మా వానొస్తుందీ" అంది.

నూర్ ఇల్లు కసాబిసా చిమ్మేస్తోంది...

స్టౌ వెలిగించి పాలప్యాకెట్లో రెండు కత్తిరించి స్టౌ మీదుంచి కిచెన్ సింక్ దగ్గరే బ్రష్ చేసుకుంటూ నన్ను నేను మసగ్గా వున్న (అయిపోయిన) సింక్ మీది అద్దంలో చూసుకున్నా...

ఒకట్రెండు తెల్ల వెంట్రుకలు... కళ్ళకింద నల్లటి మరకలు...

నుదటిమీద స్టిక్కర్ అతికించీ అతికించీ ఏర్పడ్డ గుండ్రటి గుర్తు. నాకు ముప్పై అయిదేళ్ళ వయస్సు వచ్చేసింది అని ప్రత్యేకంగా చెప్పే గుర్తులేవీ లేవు... నా యిద్దరు పిల్లలు తప్ప...

బ్రష్చేసుకుంటూనే పొంగుతున్న పాలగిన్నె కింద బర్నర్ ఆఫ్ చేసి పాలమీద చిల్లుల మూత పారేసా...

బ్రష్చేసుకుని నాకూ నూరూర్కీ టీ కలిపా...

కిచెన్ కబోర్డ్ కానుకుని కింద కూచుని పెద్దగా చప్పుడు చేస్తూ నూర్

టీ తాగుతోంది.

నేనూ పెద్ద కప్పు నిండా టీ పోసుకుని దాదాపు పసుపు రంగులోకి మారిన ఫ్రిడ్జ్ పక్కన స్టూల్మీద కూచున్నా...

"పైసలిత్తవా?" పెద్దగా అడిగింది నూర్.

"జీతమీరోజు తీసుకుంటా సాయంత్రం తీసుకో" అన్నా.

వంటగది మాసిపోయి మసిచూరిన బల్బు కాంతిలో మసగ్గా వుంది.

వుల్లిపాయల బుట్టలో నాలుగే వుల్లిపాయలున్నై... దాని పక్కగా వేళ్లాడ్తోన్న మసిగుడ్డలు ఆ బల్బు కాంతిలో ముసుగేసుకున్న ముసలమ్మ ముఖంలాగా కనిపిస్తోన్నాయి...

ఫ్రిజ్ పెయింట్ పెచ్చులూడుతోంది...

ఆ పెచ్చులూడిన జాడలూ... తబ్బూ బృందలతికించిన స్టిక్కర్లూ కకావికలంగా కలిసి పోయున్నాయి.

నూర్కు జీతమివ్వాలి... అందుకు ముందు నేను జీతం తీసుకోవాలి. స్యాలరీ కవరందిస్తూ ముసలి అక్కౌంటెంట్ వేళ్ళు తాకుతాడు... మ్యానేజర్గాడు పచ్చిగానే అడుగుతాడు... 'యూ లుక్ లవ్లీ టు డే... ఈ చీర సాల్వార్ కమీజ్కంటే చాలా బాగుంది'... అంటూ నడుంమీద చూపుతో నాకుతాడు...

ఒక్కసారి ఒళ్ళంతా జలదరించింది... నూర్వేపు చూసా... మాసిపోయిన అందం నూర్బానో.

క్యాలస్డ్ బ్యూటీ నూర్.

కట్టుకున్న నైలెక్స్ పువ్వుల చీర మోకాళ్ళ మీదికి జరిగుంది...

పచ్చటి కాళ్ళు పిక్కలూ సన్నటి వెంట్రుకల్తో...

నల్లగా పగిలిన చీలికల్తో పాదాలు...

మట్టి పేరుకుపోయిన కాలి గోళ్ళు...

రెండు బొటనవేళ్ళకీ పెచ్చులూడిన నెయిల్ పెయింట్... మధ్య వేళ్ళకి మెట్టెలు.

నూర్...

మాసిపోయిన అందం...

అప్రయత్నంగా మసిచూరిన బల్బ్కేసి చూసా...

మళ్ళీ నూర్ కేసి....

ఆ బల్బ్... నూర్ యిద్దరూ పొగచూరి ఉన్నారని పించేట్టు...

త్వరగా టిఫిన్ తయారుచేసి వంట వండేయాలి... ఈ రోజు పిల్లల్తోపాటు స్కూల్కెళ్ళాలి... కరస్పాండెంట్ ఏం చెబుతుందో తెలుసు. బృందని స్కూల్నుంచి తీసుకెళ్ళమన్చెప్తుంది...

నాకు బృందని తీసుకెళ్ళి ఆ మెంటల్లీ రిటార్డెడ్ పిల్లల మధ్యన వేయడం సుతారామూ యిష్టం లేదు...

బృంద అన్నీ నెమ్మదిగా నేర్చుకుంటుందంతే.... ఆ జబ్బే దానికి రాకుండా వుండుంటే అదీపాటికి ఏ సెవెన్తో వుండుండేది...

'ప్చ్' బృంద బావుంటే...ఫయ్యూం మాయమవకుండా వుంటే... అన్నీ అన్నీ నేననుకున్నట్టుగానే వుంటే ఈ నా ప్రపంచమిట్లా ఎందుకుంటుందీ... నిర్వేదంతో కూడుకున్న ఓ చిర్నవ్వు...

ఖాళీ టీ కప్ నూర్ కందించి బాత్రూం వేపు కదిలా... యిద్దరూ ఏం చేస్తున్నారోనని... తబ్బూ బృందతో బ్రష్మీద పేస్టు వేయిస్తోంది... "యిట్టా... యిట్టా... నెమ్మదిగా నొక్కూ... అంతా బైటికొచ్చేస్తుంది... కరెక్ట్గా బ్రష్ మీదకి పెట్టు మూతి... అట్లా పిసక్కూ...ఛీ నీకస్సలేమీ రాదుపో. చూడు చూడు పేస్ట్ బ్రష్మీదంతా పూసుకుంది...హాఁ..."

బృందని విసుక్కుని రెండు చేతులూ నడుంమీద పెట్టుకుని...తలవంచి ఓ పక్కకి కోపంగా చూట్టం మొదలుపెట్టింది... బృంద నోరంతా తెరచి నవ్వింది.

నా అలికిడికి తబ్బూ బృందలిద్దరూ నా వేపు చూసారు...

"నీదైందా?"అని తబ్బూనడిగి..."నువ్ కానీ వెళ్ళు నువ్ మొహం కడుక్కోవాలంటే ఓ యుగం" అని బృందని బాత్రూంవేపు చిన్నగా నెట్టా...

"చూడు మా! అది పేస్టంతా పిసికేస్తుంది" అని కంప్లెయిన్ చేసింది తబ్బూ...

నవ్వి... "సరే సరే పద నీ ముఖం తుడుచుకో ముందు" అని మళ్ళీ కిచెన్వేపు తొంగి చూసా...

నూర్ వెనుక భాగం కనబడుతోంది... గిన్నెలు బరాబరా తోముతోన్న శబ్దం వినిపిస్తోంది... పక్కింట్లోంచీ సుప్రభాతం వినబడ్తోంది.... ప్రపంచం చిన్నగా నిద్రలేస్తోంది అనుకున్నా...

***

"మీ చిన్నమ్మాయి చాలా బ్రిలియంటండీ... కానీ బృందే... ఎలా చెప్పండి... ఏ క్లాసులోనూ వుంచలేము... అందునా విపరీతంగా అల్లరి చేస్తుంది... అలాంటి పిల్లలకోసం ఆ వికాస్ రిహాబిలిటేషన్లో ఏదో వుందిగా అందులో చేర్చండి...."

"కాదు మేడం... నేనొక్కదాన్ని... ఇంకెవ్వరూ లేరు... ఇక్కడైతే పిల్లలిద్దరూ కలిసి వస్తారు వెళ్తారు... మధ్యాహ్నం కూడా బృందకు తబస్సుమే అన్నమదీ పెడుతుంది. నా ఫైట్ అర్థం చేసుకోండి ప్లీజ్!" దీనంగా అడిగా.. నిజానికి లోపల అసహనంగా వుంది... నా అసహాయతకి నామీద నాకే కోపమొస్తోంది. బృందని బైట కూచోబెట్టి వచ్చా లోపలికి.

"మీరూ నా పరిస్థితి అర్థం చేసుకోవాలి... ఇది మామూలు స్కూల్. అలాంటి రిటార్డెడ్ పిల్లల్ని ఎకామడేట్ చేసుకోడం చాలా కష్టం.... అక్కడికీ ప్రయత్నించా మీకు తెలుసు...సారీ యూకెన్ టేక్ బృందా... ఎన్ .."

యింకా ఏదో చెప్పబోతోందావిడ...

బైటినించీ గట్టిగా బృంద ఏడుపు...

నేనూ కరస్పాండెంట్ యిద్దరం కలిసి బైటి కొచ్చాం...

అక్కడ వరండాలో క్రోటన్ పువ్వులు రేకులు రేకులుగా తెంపబడి వెదజల్లబడి వున్నాయి... ఓ టీచరు చీరకంటిన బురదని కడుక్కుంటోంది.

స్తంబానికానుకుని కూచుని బృంద ఏడుస్తోంది.

ఆ టీచరు మా ముందునుంచీ రుసరుసలాడుతూ వెళ్తూ... "మొరాన్ మొరాన్ పిచ్చిముండ పిచ్చిముండ" అనుకుంటూ వెళ్ళిపోయింది.

అర్థమైందా? అన్నట్టు కరస్పాండెంట్ నా వేపు చూస్తూ బృందవేపు చేతులు చూపింది.

తెలిసిపోతోంది... బృంద ఆ పువ్వుల్ని తెంపేసింది... ఆ టీచర్ దాన్ని చావగొట్టింది...

నన్ను కొట్టినా బావుణ్ణు అనిపించింది...

అసహాయంగా బృంద దగ్గరికొచ్చి చెయ్యిపట్టి యీడుస్తూ "లే" అనరిచా.ఏడుపింకా ఎక్కువ చేసి గింజుకోసాగింది.

"నేనేం కాదు మా... నేను కాదు మా" అంటూ ఏడుస్తూ తలడ్డంగా వూపసాగింది.

నాకు తెలుసు ఆ క్షణంలో దాన్ని బుజ్జగించి సముదాయించాలి...కానీ విచక్షణ కోల్పోయి కోపంగా మళ్ళీ అరిచా "లే" అని...

ఓ వేపు ఆఫీసుకు టైం అవుతోంది...యింకోవేపు భలే కూతుర్ని కన్నావ్ అన్నట్టు కరస్పాండెంట్ చూపులు... పే డే ఈరోజు... వెళ్ళి జీతం తీసుకోవాలి. ఏం చేస్తున్నానో జ్ఞానం కోల్పోయా... బృందని వంగదీసి దబా దబా వీపుమీద చరిచి...

"లే యూస్లెస్ గాల్ లే" అనరిచా...

ఒక్కసారిగా బృంద కళ్ళల్లోకి భయం ప్రవేశించింది...

యావత్తు ప్రపంచం కసిరినా విసుక్కున్నా... అది భరిస్తుందేమో కానీ... ఆఖరికి నేను... అమ్మ... కూడా...

విస్మయం నిండిన కళ్ళను విశాలం చేసి నా వేపు మాసింది...

ఓ విధమైన అపనమ్మకం... అనుమానం... భీతి కలగలిసి రాని ఏడుపును ఆపేసాయి...

నే చేసిన తప్పు నాకు తెలిసిపోతోంది... ఏం చేసాను నేను....?!

"నువ్వు కూడానా అమ్మా?" అన్నట్టు బేలగా జాలిగా నీళ్ళు నిండిన కళ్ళతో బృంద చూసే ఆ చూపును తట్టుకోలేకపోతున్నా....

"ఓ" అని ఎలుగెత్తి అరవాలనిపించింది...

అయినా దాన్నలాగే లాక్కుంటూ స్కూలు బైటికొచ్చేసా...

స్కూలు గేటు బైట ఏం చేయాలా అనాలోచిస్తూ నుంచున్నా...

"మా! మా! నేనేం చెయ్లా మా... పూలు సుజాతేతెంపిందీ... మిస్ నన్ను తిట్టిందీ... నేను కాదంటే కూడా కొట్టొచ్చీ పైపు తగిలి కింద పడిందీ... నిజం మా .... నేను కాదు మా"

నా చెయ్యిని నిండుగా రెండు చేతుల్తో చుట్టి అంది బృంద....

నా కళ్ళు మసక బారాయి...

(మిగతా వచ్చేవారం)

"కాదు మేడం... నేనొక్కదాన్ని... ఇంకెవ్వరూ లేరు... ఇక్కడైతే పిల్లలిద్దరూ కలిసి వస్తారు వెళ్తారు... మధ్యాహ్నం కూడా బృందకు తబస్సుమే అన్నమదీ పెడుతుంది. నా ఫైట్ అర్థం చేసుకోండి ప్లీజ్!" దీనంగా అడిగా.. నిజానికి లోపల అసహనంగా వుంది... నా అసహాయతకి నా మీద నాకే కోపమొస్తోంది. బృందని బైట కూచోబెట్టి వచ్చా లోపలికి.